సాక్షి అనంతపురం

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



భారీగా పెరిగిన భూగర్భజలాలు

జిల్లాలో మూడేళ్లుగా క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు భారీగా పెరిగాయి.

8లో




టీబీ డ్యాంలో 45 టీఎంసీలు

తుంగభద్ర డ్యాంలో సోమవారం నాటికి 45.428 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 0 కాగా.. ఔట్‌ఫ్లో 9,398 క్యూసెక్కులుగా ఉంది.



జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.



అక్రమాల అనకొండలు

- తాడిపత్రిలో జేసీ బ్రదర్స్ అరాచక పర్వం
- దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమార్జనే వారి ధ్యేయం
- అధికారం కోసం కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం
- గతంలో టీడీపీ వారిపైనే జేసీ వర్గీయుల హత్యాకాండ
- ఇప్పుడు వారిని ప్రశ్నించే ధైర్యం లోకేష్‌కు ఉందా?



త్రిశూల్ సిమెంట్స్ పేరిట జేసీ బ్రదర్స్ అక్రమంగా సున్నపురాయిని తవ్విన ప్రాంతం ఇక్కడే (ఫైల్)

తాడిపత్రి: అధికారాన్ని అడ్డుపెట్టుకుని అంతులేని అవినీతికి పాల్పడ్డారు. ప్రతి పనిలోనూ కమీషన్లు.. మామూళ్లు పుచ్చుకున్నారు. ఇవ్వని వారిని ముప్పు తిప్పలు పెట్టారు. తమ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు వర్గకక్షలు సృష్టించారు. అవినీతి అక్రమాల్లో అనకొండగా మారిపోయారు. వారు ఎవరో కాదు జేసీ బ్రదర్స్ (మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి – మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి). దౌర్జన్యం, ఫ్యాక్షనిజం, రౌడీయిజంతో నాలుగు దశాబ్దాలు తాడిపత్రి నియోజకవర్గాన్ని ఏలిన ఈ సోదరులు ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత మూటగట్టుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి పరాజయం పొందారు. తిరిగి అధికారం చేజిక్కించుకునేందుకు కుట్రలు, కుతంత్రాలతో కూడిన రాజకీయాలకు తెరలేపుతున్నారు.

అంతా దోచుడు.. దాచుడే..

జేసీ సోదరుల ధన దాహానికి హద్దే లేకుండాపోయింది. మట్కా, పేకాట నుంచి ప్రతి పనిలోనూ కమీషన్లతో పేట్రేగిపోయారు. ఆఖరుకు బినామీల సాయంతోనూ యథేచ్ఛగా దోచేశారు. చికెన్ సరఫరాదారులు రాష్ట్రమంతా ఒకే ధరతో అమ్ముతారు. కానీ గతంలో తాడిపత్రిలో అందుకు విరుద్ధంగా 20 శాతం అదనపు ధరతో విక్రయించారు. అదనపు ధర రూపంలో వచ్చిన సొమ్మంతా జేసీ సోదరుల ధనాగారానికి చేరింది. తాడిపత్రి మునిసిపల్ ఎస్ఎంఆర్ ఉద్యోగి ఒకరు మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే అన్ని రకాల అవసరాలకు డీజిల్ కొనుగోలు మొదలుకుని.. ఇళ్లు, భవన, ఇతర నిర్మాణాల అనుమతుల వరకు అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు ఆర్జించాడు. ఇదివరకు ఇక్కడ పని చేసిన ఒక ఉద్యోగి దాదాపు రూ.70 లక్షలు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. వీరికి జేసీ బ్రదర్స్ అండ ఉంది. గతంలో పందులను తాడిపత్రి పట్టణం నుంచి ఊరి బయటకు తరలిస్తామని చెప్పి.. వాటిని నేరుగా బెంగళూరుకు తీసుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకున్న చరిత్ర జేసీ సోదరులదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అనుమతుల పేరుతో రూ.లక్షల్లో వసూలు

తాడిపత్రి మున్సిపాలిటీలో గృహాలు, వాణిజ్య భవన నిర్మాణాలకు అనుమతుల పేరుతో అక్రమంగా రూ.లక్షలు వసూలు చేసి.. స్వచ్ఛంద సంస్థకు విరాళాలు ఇచ్చినట్లుగా చూపించారు. ఇక జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, ప్రస్తుతం జిల్లా బహిష్కరణకు గురై హైదరాబాద్‌లో ఉంటున్న వ్యక్తి.. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ తానై అన్ని శాఖల్లోనూ అక్రమాలకు పాల్పడ్డాడు. రూ.కోట్ల విలువైన స్థిర, చరాస్తులు పోగేసుకున్నాడు. జేసీ బ్రదర్స్‌కు బినామీ అయిన ఓ వ్యక్తి ప్రభుత్వ, దేవదాయ, ప్రయివేట్ స్థలాలను కబ్జా చేసి, చివరికి దుప్పటి పంచాయితీలు నిర్వహించి రూ.కోట్లకు పడగలెత్తాడు. రెవెన్యూ శాఖలోని లొసుగులను ఆసరాగా చేసుకుని అడ్డదిడ్డంగా భూములు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు.

స్థానికుల ఉపాధికి గండి..

ఉద్యోగాలు అడగరాదని ఇంటి ముందు బోర్డును తగిలించుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి.. తాము మాత్రం స్థానిక కంపెనీలలో కాంట్రాక్టు పనులు తీసుకుని రూ.కోట్లు ఆర్జించారు. ఫలితంగా స్థానికంగా ఉన్న లారీ ఓనర్లు, ట్రేడర్లు పనులు లేక ఊర్లు విడిచి వెళ్లిపోయేలా చేశారు. అంతే కాదు ఒకే రిజిస్ట్రేషన్ నంబర్‌తో అనేక వాహనాలను నడిపించి రవాణా శాఖ ఆదాయానికి రూ.కోట్లలో గండి కొట్టారు. నిషేధిత బీఎస్– 3 వాహనాలను తుక్కు కింద కొనుగోలు చేసి, వాటిని బీఎస్– 4 గా చూపి, అక్రమంగా విక్రయాలు చేసి, ఈడీ చేతికి చిక్కారు.

త్రిశూల్ పేరిట గనుల దోపిడీ

త్రిశూల్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని జేసీ బ్రదర్స్ కాంగ్రెస్ హయాంలో అనుమతులు తీసుకున్నారు. తద్వారా యాడికి మండలంలో వందలాది ఎకరాల సున్నపురాళ్ల గనులను లీజుకు పొందారు. పరిశ్రమ ఏర్పాటు చేయకుండానే.. అక్రమంగా ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకున్నారు. త్రిశూల్ పరిశ్రమ పేరిట జరిగిన అక్రమాలు వాస్తవమేనని అప్పట్లో ప్రభుత్వం కూడా తేల్చింది. యాడికి మండలంలో త్రిశూల్ సిమెంట్‌కు కేటాయించిన భూములను అప్పట్లో టీడీపీ నాయకుల బృందం పరిశీలించింది. అక్రమాలపై సభా సంఘం వేయాలని డిమాండ్ చేసింది.

పెద్దల గుప్పిట్లో పేదల భూములు

జేసీ బ్రదర్స్ స్వగ్రామం పెద్దపప్పూరు మండలం జూటూరు సమీపాన వ్యవసాయ కళాశాల కోసం దళితులు, సామాన్యులను భయపెట్టి వందలాది ఎకరాల భూములను తక్కువ ధరకు తీసుకున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పెద్దపప్పూరు మండలం ధర్మాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని చిన్నపప్పూరు, చింతరపల్లి సరిహద్దులోని సర్వే నంబరు 15, 16లో 17 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 15 మంది నిరుపేద దళితులకు పంపిణీ చేసింది. 2016లో జేసీ సోదరులు అగ్రికల్చర్ కళాశాల నిర్మాణానికి మీభూములిస్తే అందుకు ప్రతిఫలంగా మీ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి, ఎకరాకు రూ.లక్ష మాత్రమే చెల్లించి వారితో అగ్రిమెంటు రాయించుకుని, పట్టాదారు పాసుపుస్తకాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పించలేదు సరికదా కనీసం తమ పొలాల్లో సాగు చేసుకునేందుకూ అవకాశమివ్వడం లేదని బాధితులు వాపోతున్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి రాక్షసుడు



మాట్లాడుతున్న జిలాన్‌బాషా

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓ రాక్షసుడని మాజీ వైస్ చైర్మన్, టీడీపీ నాయకుడు బీఎండీ జిలాన్‌బాషా మండిపడ్డారు. సోమవారం ఆయన తాడిపత్రిలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్‌లో జేసీ సోదరులు (దివాకర్‌రెడ్డి- ప్రభాకర్‌రెడ్డి) ఎన్నో పదవులు అనుభవించారన్నారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో కాంగ్రెస్ పని అయిపోయిందని తెలుసుకుని.. అధికారం కోసం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే నైజం వీరిదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు 1989 నుంచి 1993 వరకు జేసీ సోదరులు సాగించిన అరాచకాలకు ఎంతో మంది టీడీపీ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు ఆస్తులు పోగొట్టుకున్నారని ఆరోపించారు. అప్పటి టీడీపీ నాయకుడు, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ నియాజ్ బాషాకు చెందిన బీడీ ఫ్యాక్టరీపై దాడి చేయడమే కాకుండా షాపింగ్ కాంప్లెక్స్‌ను కూలగొట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఎందరో టీడీపీ కార్యకర్తలను బలిగొన్న ప్రభాకర్‌రెడ్డి అదే పార్టీ జెండా కిందికి వచ్చి ఈ రోజు మీసాలు దువ్వుతున్నాడని... అధికారం, అంగబలం ఉంటే తాను కూడా జేసీ ఇంటి వద్దకే వెళ్లి మీసం దువ్వుతానని జిలాన్ బాషా అన్నారు.

జేసీ బ్రదర్స్ అక్రమాలు, దౌర్జన్యాలపై ఏమంటావు లోకేష్?



యువగళం పాదయాత్ర ప్రారంభం నుంచి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులను లక్ష్యంగా చేసుకుని నారా లోకేష్ విమర్శలు చేస్తున్నారు. స్థానిక టీడీపీ నేతలు ఇచ్చిన స్క్రిప్టులు చదివి నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మరి తమ సొంత పార్టీలోని జేసీ బ్రదర్స్ అరాచకాలు, గతంలో టీడీపీ కార్యకర్తలపై సాగించిన దాష్టీకాలు, అవినీతి అక్రమాలు, భూకబ్జాలపై లోకేష్ నోరు మెదుపుతారా? లేక అటువంటివేమీ తమ పార్టీకి వర్తించవు.. అధికార పక్షం వారికేనంటూ బుకాయిస్తాడా? అన్నది చర్చనీయాంశంగా మారింది. గతంలో టీడీపీ వారిపైనే జేసీ వర్గీయులు హత్యాకాండ సాగించిన ఘటనలూ లేకపోలేదు. మరి ఇప్పుడు జేసీ సోదరులు టీడీపీలోనే ఉన్నారు కాబట్టి గతంలో వారు చేసిన, సాగించిన, సాగిస్తున్న దౌర్జన్యాలు, ఘోరాలన్నీ అబద్ధమని 'యువగళం'లో చెబుతారా? లేక చానా గొప్పవారంటూ కీర్తిస్తారా అన్నది వేచి చూడాలి.

న్యూస్‌రీల్

17న సీఎం జగన్ రాక



అనంతపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 17వ తేదీన నార్పలకు వస్తున్నారు. జగనన్న వసతి దీవెన పథకం కింద నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ చేయనున్నారు. బహిరంగ సభా వేదిక నుంచి సీఎం బటన్ నొక్కి నిధులు జమ చేసి.. ప్రసంగిస్తారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

టమాట గరిష్ట ధర కిలో రూ.10



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్ఠంగా రూ.10 పలికింది. మార్కెట్‌కు 30 టన్నుల టమాటాలు అమ్మకానికి రాగా.. గరిష్ఠ ధర రూ.10, కనిష్ఠం రూ.3, సరాసరి రూ.5.50 ప్రకారం అమ్మకాలు జరిగాయని ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్ ప్రసాద్ తెలిపారు.

చీనీ టన్ను రూ.28 వేలు



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 504 టన్నుల చీనీకాయలు అమ్మకానికి రాగా.. వాటిని ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. కనిష్ఠ ధర రూ.13 వేలు, సరాసరి రూ.18 వేలు చొప్పున విక్రయించారు.

కానిస్టేబుల్‌కు దేహశుద్ధి



కానిస్టేబుల్‌పై దాడికి దిగుతున్న దృశ్యం

సోమందేపల్లి: కానిస్టేబుల్‌కు భార్య సంబంధీకులు దేహశుద్ధి చేసిన ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో జరిగింది. హిందూపురం ప్రాంతంలో పనిచేసే కానిస్టేబుల్ సోమందేపల్లి మండల కేంద్రంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో భార్య, పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నాడు. సోమవారం ఆ వివాహితతో మాట్లాడటానికి కానిస్టేబుల్ సోమందేపల్లిలోని వాల్మీకి సర్కిల్ వద్దకు వచ్చాడు. అప్పటికే నిఘా వేసి ఉన్న భార్య బంధువులు అక్కడికి చేరుకుని పిడిగుద్దులు గుద్దారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానికులు జోక్యం చేసుకుని ఇరు పక్షాల వారికీ నచ్చజెప్పారు. అనంతరం తన భర్తతో వివాహేతర సంబంధం కల్గి ఉన్న ఆ మహిళకు చెందిన ఫ్యాన్సీ స్టోర్ వద్దకు కానిస్టేబుల్ భార్య చేరుకోగా.. అప్పటికే సదరు మహిళ అక్కడి నుంచి పరారైపోయింది.

తొలి ప్రాధాన్యత.. పేదలందరికీ ఇళ్లు



బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ గౌతమి

- రీసర్వే యజ్ఞం పూర్తి చేస్తాం
- అర్హులకు అన్యాయం జరగనివ్వం
- పథకాల అమలుపై మరింత పర్యవేక్షణ
- 'సాక్షి'తో నూతన కలెక్టర్ గౌతమి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే తొలి ప్రాధాన్యత. పేదల సొంతింటి కల సాకారం చేస్తాం. ప్రభుత్వమే పేదలందరికీ పట్టణాలు, పల్లెల్లో ఉచితంగా స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తోంది. హౌసింగ్ విషయంలో పేదలందరికీ గరిష్ఠంగా లబ్ధి జరగాలి. సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ సంతృప్త స్థాయిలో అందాలి' అని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. జిల్లాకు నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె సోమవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. కలెక్టర్ మాటల్లోనే...

సెంటిమెంట్‌ను గౌరవిస్తాం..

భూముల రీసర్వే యజ్ఞంలా జరుగుతోంది. భూములపై హక్కులు ఆ కుటుంబానికి సెంటిమెంట్‌తో కూడుకున్నవి. ఆ సెంటిమెంట్‌ను గౌరవిస్తాం. రీసర్వే పెద్ద ప్రాజెక్టు. దీన్ని అనుకున్న సమయంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

అందరికీ ఫలాలు అందాలి

అర్హులై ఉండి ఫలానా ప్రభుత్వ పథకం నాకు అందలేదు అన్న ఫిర్యాదే రాకూడదు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు చేయాలని సీఎం చెప్పారు. దీనిపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వారికి లబ్ధి జరిగేలా చేస్తాం.

'నాడు–నేడు' పనులకు మరింత పదును

ఈరోజు చాలా ఊర్లలో చూశాను. నాడు – నేడు పనులతో ఆస్పత్రులు, స్కూళ్లు చాలా బాగుపడ్డాయి. జిల్లాలో జరుగుతున్న పనులను మరింత వేగవంతం చేస్తాం. కొత్తగా రూపుదిద్దుకునే పాఠశాలలు భవిష్యత్ తరాలకు మార్గదర్శనం చేస్తాయి. ప్రైవేటు స్కూళ్లకంటే ప్రభుత్వ స్కూళ్లు బాగున్నాయన్న అభిప్రాయం కలిగేలా చేస్తాం. ఇక ఆస్పత్రుల్లో నాడు – నేడు పనులు పూర్తి చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తాం.

హౌసింగ్ ప్రాజెక్టు పనులపై..

ఈ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం పేదలందరికీ సొంతిళ్లు. ఇదే నా మొదటి ప్రాధాన్యత. సవాళ్లు ఎన్ని ఎదురైనా పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత పూర్తిచేస్తాం.

జిల్లాపై అవగాహన ఉంది

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకు కొత్త కావొచ్చు.. కానీ ఇక్కడ నేను రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో)గా మూడేళ్లకు పైగా పనిచేశాను. జిల్లాల విభజన తర్వాత పరిధి తగ్గి ఉండచ్చు కానీ.. ఈ జిల్లాపై నాకు మంచి అవగాహన ఉంది. ఇది నాకు మంచిగా కలిసొచ్చే అంశం.

గతేడాది పది ఫలితాలు..

గత ఏడాది 10వ తరగతి ఫలితాలు నిరాశాజనకంగా వచ్చాయి. పదో తరగతిలో ఒత్తిడి పెంచడం కాదు.. ఏడో తరగతి నుంచే వారిని సంసిద్ధం చేస్తాం. దీనిపై ఈరోజే డీఈఓతో చర్చించాను. ఇకపై స్కూళ్లపై ప్రత్యేక ఫోకస్‌తో పనిచేస్తాం.



'స్పందన'లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ ఎం.గౌతమి

అనంతను అగ్రగామిగా తీర్చిదిద్దుదాం

అనంతపురం: 'అనంతపురం జిల్లాతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. గతంలో ఆర్డీఓగా పనిచేసిన స్థానంలోనే కలెక్టర్‌గా సేవ చేసే భాగ్యం దక్కడం గర్వంగా ఉంది' అని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. కలెక్టర్‌గా సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేసిన నూతన కలెక్టర్‌కు జేసీ కేతన్‌గార్గ్ స్వాగతం పలికారు. తర్వాత కలెక్టర్‌ను డీఆర్వో గాయత్రీదేవి, కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, ఆర్డీఓ మధుసూదన్, డీపీఆర్వో గురుస్వామిశెట్టి, ఎల్డీఎం నాగరాజారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి, తహసీల్దార్ శ్రీరామమూర్తి తదితరులు చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం 'స్పందన'లో పాల్గొని జేసీ కేతన్‌గార్గ్‌తో కలిసి ప్రజల నుంచి 228 అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అధికారులందరూ సమన్వయంతో సమష్టిగా పనిచేసి జిల్లాను అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పునర్వ్యవస్థీకరణ అనంతరం 31 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయని, ప్రతి మండలంపైనా ఫోకస్ చేస్తామన్నారు. భూ సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. స్పందన నిర్వహణలో లోపాలున్నట్లు స్పష్టమైందని, అధికారులు పనితీరు మార్చుకుని సకాలంలో పరిష్కారం చూపాలని సూచించారు.

కలెక్టర్ ప్రస్థానం ఇలా..

- 2007 – 2009 వరకు చిత్తూరు జిల్లాలో ప్రొబేషనరీ అధికారిగా ప్రస్థానం
- 2009 నుంచి 2012 వరకు అనంతపురం ఆర్డీఓగా పనిచేశారు.
- 2012 – 2015 వరకు నెల్లూరు డ్వామా పీడీ
- 2015 – 19 వరకు టీటీడీ డిప్యూటీ ఈఓగా..
- 2019 – 22 వరకు వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా..
- 2022 – 2023 ఏప్రిల్ 7 వరకు తిరుపతి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈఓ

నాగలక్ష్మి సేవలు ప్రశంసనీయం



నాగలక్ష్మి దంపతులకు పూలమొక్కఅందిస్తున్న శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం: జిల్లా కలెక్టర్‌గా నాగలక్ష్మి సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు. బదిలీపై విజయనగరం జిల్లా కలెక్టర్‌గా వెళ్తున్న నాగలక్ష్మికి సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. నూతన కలెక్టర్ ఎం.గౌతమి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బదిలీ అనేది ప్రతి ఉద్యోగికి సర్వసాధారణమన్నారు. అయితే అంకితభావంతో చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నాగలక్ష్మి సహనశీలిగా ఖ్యాతి దక్కించుకున్నారని ప్రశంసించారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తదితరులు నాగలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్, ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, జే. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో డీఎస్సీ-98 మెరిట్ జాబితా

రాప్తాడు రూరల్: డీఎస్సీ–98లో అర్హత సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాను కలెక్టర్ ఆమోదంతో సోమవారం విడుదల చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కింద ఎస్జీటీలుగా పని చేసేందుకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 572 మంది అభ్యర్థులు అంగీకారం తెలిపారు. వీరిలో ఈ ఏడాది మార్చి 15 నాటికి 60 ఏళ్లు నిండిన వారిని అనర్హులుగా గుర్తించారు. తక్కిన 536 మంది అభ్యర్థులను కౌన్సెలింగ్ ద్వారా ఎస్జీటీలుగా నియమిస్తారు. ఈ అభ్యర్థుల మెరిట్ జాబితాను https://doeananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ నెల 12, 13 తేదీల్లో అనంతపురం సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ తెలిపారు. వరుస నంబరు 1 నుంచి 280 వరకు 12వ తేదీ, 281 నుంచి 536 వరకు 13వ తేదీ కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ఇంటర్వ్యూ లెటర్, ఒరిజినల్ విద్యార్హత పత్రాలు, ఆధార్, 3 ఫొటోలు, సర్టిఫికెట్లు జిరాక్స్‌లను గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తీసుకురావాలని సూచించారు.

చదువుతోనే వెలుగు

- జిల్లాలో గణనీయంగా పెరిగిన అక్షరాస్యతా శాతం
- అమ్మాయిలను చదివించడంపై తల్లిదండ్రుల ఆసక్తి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలో చదువుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. గతంతో పోల్చితే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చిన్న చిన్న కూలిపనులు చేసుకునే తల్లిదండ్రులూ తమ పిల్లలనూ ఇంగ్లిష్ మీడియంలో చేరుస్తున్నారు. ఫలితంగా అక్షరాస్యతా శాతం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా చదువుకునే అమ్మాయిల సంఖ్య పెరగడం హర్షణీయమని విద్యా నిపుణులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రుల్లో అవగాహనతోనే : గడిచిన రెండు దశాబ్దాలుగా అబ్బాయిలు, అమ్మాయిలను చదివించాలన్న ఆసక్తి తల్లిదండ్రుల్లో బాగా పెరిగింది. ఉద్యోగావకాశాలు మెండుగా ఉండటం వల్ల ఎక్కడో ఒక చోట స్థిరపడతారన్న ఆలోచన వారిలో ఉంది. ఒకప్పుడు అమ్మాయిలను చదువు కోసం బయటకు పంపించాలంటే అయిష్టత చూపేవారు. ఇప్పుడు విదేశాలకు కూడా చదువులకు పంపించే స్థాయికి చేరుకున్నారు. ఏటా 300 మందికి పైగా పట్టభద్రులు అనంతపురం జిల్లా నుంచి అమెరికా లాంటి దేశాలకు ఉన్నత చదువుల కోసం వెళుతున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన వేలాదిమంది అమెరికాలో పలు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.



1981 నుంచి 2021 వరకూ జిల్లాలో అక్షరాస్యతా శాతం

సంవత్సరం	పురుషులు	స్త్రీలు	సగటు %
1981	40.84	16.52	29.02
1991	55.92	27.61	42.18
2001	63.38	43.34	46.13
2011	74.77	59.96	67.35
2021 (అంచనా)	83.00	65.00	74.00

నాలుగేళ్లలో మరింతగా.. : గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడంతో నిరుపేదలు కూడా తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపిస్తున్నారు. అమ్మ ఒడి, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్నం భోజనం తదితర కార్యక్రమాల వల్ల మలు పిల్లల చదువులపై తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

అనూహ్యంగా పెరుగుదల



2010లో 'సాక్షర భారత్' మొదలైన తర్వాత ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడు దశల్లో వివిధ కేటగిరీల్లో అక్షరాస్యతా కార్యక్రమాలు చేపట్టాం. 2009లో వయోజన విద్య ప్రత్యేక సర్వే చేపట్టింది. అందులో 9 లక్షలమంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో దాదాపు 6.10 లక్షలమందిని అక్షరాస్యులుగా మార్చాం. ఇంకా 2.90 లక్షల మంది దాకా నిరక్షరాస్యులు ఉన్నారు.

– ఆంజనేయులు, డీడీ, వయోజన విద్య

భవిష్యత్తులో మరింత పెరుగుతుంది



అక్షరాస్యతా శాతం పెరగడానికి ప్రధాన కారణం పాఠశాలల్లో వసతుల కల్పన. విద్యార్థులకు తోడ్పాటు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అమ్మ ఒడి, ఉచిత దుస్తులు, పుస్తకాలు, రుచికరమైన భోజనం వల్ల ఏ ఒక్కరూ డ్రాపౌట్ కావడం లేదు. ఈ చర్యల వల్ల భవిష్యత్తులో అక్షరాస్యతా శాతం మరింత పెరగనుంది.

– వై.చంద్రశేఖర్, టీచర్, చిగిచెర్ల జెడ్పీహెచ్ఎస్, ధర్మవరం మండలం

తల్లిదండ్రుల్లోనూ మార్పు వచ్చింది



పిల్లలు బాగా చదువుకుని ఐటీ రంగాల్లో స్థిరపడుతున్నారు. దీంతో నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల్లోనూ మార్పు వచ్చింది. కనీసం చదువుకోవాలి, తామూ సంతకాలు చేయాలనే పట్టుదల వారిలో కనిపిస్తోంది. ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు తీసుకురావడంతో పిల్లల్లో డ్రాపౌట్స్ బాగా తగ్గిపోయింది. పిల్లలు చదువుకునేందుకు తల్లిదండ్రులు బాగా ప్రోత్సహిస్తుండడం కూడా అక్షరాస్యత పెరగడానికి ఒక కారణం. ఇది శుభపరిణామం.

– ఎం.సాయిరామ్, డీఈఓ

‘జగనన్నే మా భవిష్యత్తు’కు అపూర్వ ఆదరణ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని, ఇందుకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అందుతున్న అపూర్వ ఆదరణే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. ఈ క్రమంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ వెళ్తున్న ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతో పాటు మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు.

పంటకు కోక



చీరలతో కప్పిన దానిమ్మ తోట (ఇన్‌సెట్) చీర నీడన విరగ్గాసిన దానిమ్మ కాయలు

రూ.లక్షలు వెచ్చించి సాగు చేసిన దానిమ్మ పంటను వేసవి బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం మండలం కొడిమి గ్రామంలో రైతు రేనాటి దామోదర్ దాదాపు మూడు వేల చీరలతో దానిమ్మ చెట్లకు నీడను ఏర్పాటు చేశారు. అటుగా వెళుతున్న వారు ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



తోట వద్దే చీరలు కుడుతున్న దర్జీ



దానిమ్మ చెట్లపై చీర కడుతున్న రైతు దామోదర్

భారీగా పెరిగిన భూగర్భజలాలు

- సగటు నీటి మట్టం 7.06 మీటర్లుగా నమోదు
- 20 ఏళ్ల వేసవి చరిత్రలో గతంలో ఎన్నడూ కనిపించని ఈ స్థాయి నీటిమట్టం



భారీ వర్షాలకు పెద్దవడుగూరు మండలంలో పొంగిపొర్లుతున్న వాగు (ఫైల్)

మండలాల వారీగా తాజా సగటు నీటి మట్టం

మండలం	నీటిమట్టం (మీటర్లలో)	మండలం	నీటిమట్టం (మీటర్లలో)
అనంతపురం	3.91	ఆత్మకూరు	2.95
బీకే సముద్రం	3.62	బెళుగుప్ప	9.25
బొమ్మనహాళ్	3.90	బ్రహ్మసముద్రం	5.99
డి.హీరేహాళ్	11.80	గార్లదిన్నె	2.01
గుత్తి	9.29	గుమ్మఘట్ట	4.38
గుంతకల్లు	3.45	కళ్యాణదుర్గం	6.10
కంబదూరు	6.17	కణేకల్లు	7.78
కూడేరు	6.71	కుందుర్పి	4.42
నార్పల	4.55	పామిడి	9.50
పెద్దపప్పూరు	0.36	పెద్దవడుగూరు	4.22
పుట్లూరు	7.65	రాప్తాడు	2.68
రాయదుర్గం	4.70	శెట్టూరు	14.15
శింగనమల	6.50	తాడిపత్రి	5.15
ఉరవకొండ	3.06	వజ్రకరూరు	5.97
విడపనకల్లు	2.74	యాడికి	17.45
యల్లనూరు	7.65		

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా గత మూడేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. గత ఏడాది జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకూ 464 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా.. 42 శాతం అధికంగా 662 మి.మీ నమోదైంది. వర్షాల రూపంలో 239 టీఎంసీలు ప్రవహించగా అందులో 29 టీఎంసీల వరకు నీరు భూగర్భంలో కలిసింది. వర్షాలకు తోడు హెచ్చెల్సీ, హంద్రీ–నీవా ప్రాజెక్టుల ద్వారా కోటా మేరకు నీళ్ల విడుదల చేసి వందలాది చెరువులు నింపుతుండటంతో జిల్లాలో ఏ మూల చూసినా జలకళ కనిపిస్తోంది. నాలుగేళ్ల క్రితం సగటున భూగర్భజలమట్టం 20 నుంచి 25 మీటర్లు ఉండగా ఇపుడు 7.06 మీటర్లలోనే కనిపిస్తోంది. వేసవిలో ఈ స్థాయిలో రికార్డు కావడంతో గత 20 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1.88 లక్షల బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లు వస్తుండటంతో రైతులోకం హర్షం వ్యక్తం చేస్తోంది. చంద్రబాబు హయాంలో ‘వాల్టా’ పరిధిలో 200 నుంచి 300 గ్రామాలు ఉండగా ఇపుడు వాటి సంఖ్య కేవలం 12 గ్రామాలకు పరిమితమైంది. కేవలం యాడికి మండలం మినహా మిగిలిన 30 మండలాలు సురక్షిత జాబితా (సేఫ్‌జోన్)లో ఉండటం గమనార్హం. నీటి పొదుపు పాటిస్తే భవిష్యత్తు తరాలకు సమస్య ఉండదని ఆ దిశగా భూగర్భజలశాఖ అవగాహన కార్యక్రమాలు చేపడుతామని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) కె.తిప్పేస్వామి తెలిపారు.

రూటు మారిన ‘యువగళం’

- నిరసనకు సిద్ధమైన దగాపడ్డ ‘తమ్ముళ్లు’
- అసమ్మతి సెగకు భయపడిన జేసీపీఆర్?
- తాడిపత్రిని కాదని రాయలచెరువు మీదుగా కర్నూలుకు రూటు మ్యాప్ మార్పు

తాడిపత్రి: పట్టణం మీదుగా కొనసాగాల్సిన లోకేష్ యువగళం పాదయాత్ర ఆకస్మాత్తుగా రూటు మారింది. టీడీపీ నియోజకవర్గ పెద్దల అసలు రంగు బయటపడకుండా ఉండేందుకే ఈ మార్పు అనివార్యమైనట్లుగా విమర్శలు వెల్లువెత్తాయి.

భారీ సన్నాహాలు చేసి..

శింగనమల నియోజకవర్గం నుంచి పెద్దపప్పూరు మండలంలోకి ప్రవేశించిన లోకేష్ పాదయాత్రకు సంబంధించి ముందుగా నిర్దేశించిన రూట్ మ్యాప్ మేరకు తాడిపత్రిలో బహిరంగ సభ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మేరకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి భారీగా సన్నాహాలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ అవిర్భావం నుంచి ఆ పార్టీని అంటి పెట్టుకుని ఉన్న నాయకులు లోకేష్ ఎదుట అసమ్మతి గళం విప్పేందుకు సిద్ధమయ్యారు. జేసీ సోదరులు టీడీపీలోకి చేరిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను వివరించేందుకు అందరూ ఏకతాటిపైకి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకరరెడ్డి స్వీయరక్షణలో పడ్డారు. దీంతో వెంటనే రూట్‌మ్యాప్‌ను మార్చి కొత్త మార్గాన్ని ఎంపిక చేశారు. ముందుగా నిర్దేశించిన రూట్ మ్యాప్ మేరకు తాడిపత్రిలో బహిరంగ సభ అనంతరం బుగ్గ, అంకిరెడ్డిపల్లి మీదుగా కర్నూలు జిల్లాలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించాల్సి ఉంది. అయితే తాజాగా మార్పు చేసిన రూట్ మ్యాప్ మేరకు పెద్దపప్పూరు నుంచి నేరుగా యాడికి మండలం రాయలచెరువు మీదుగా కర్నూలు జిల్లాలోకి ప్రవేశించనుంది.

జేసీ నియంతృత్వ పోకడలపై భగ్గుమంటున్న పాతకాపులు

కాంగ్రెస్ పార్టీలో జేసీ సోదరులున్నంత కాలమూ టీడీపీ నాయకులను, కార్యకర్తలను అన్ని విధాలుగా ఇబ్బంది పెడుతూ వచ్చారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్‌ను వీడి తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు టీడీపీ తీర్థం పుచ్చుకున్న తర్వాత అప్పటి వరకూ ఆ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న ఎందరినో తమ నియంతృత్వ పోకడలతో జేసీ సోదరులు అణచి వేస్తూ వచ్చారు. విపత్కర పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచి జేసీ సోదరుల దౌర్జన్యాలను ప్రాణాలకు తెగించి ఎదుర్కొన్న పేరం నాగిరెడ్డి, వేలూరు శ్రీనివాసులు, ఫయాజ్ బాషా, జిలానీ బాషా తదితరులు పూర్తిగా కనుమరుగయ్యారు. కొందరు జేసీ సోదరుల దౌర్జన్యాలకు భయపడి వారి పంచన చేరగా...ఇంకొందరు మరో పార్టీలోకి వలస వెళ్లారు. మరి కొందరు రాజకీయాలను వీడి తటస్థంగా ఉండిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో జేసీ అక్రమాలు నేరుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ దృష్టికి తీసుకెళ్లేందుకు తాడిపత్రి బహిరంగ సభను వేదికగా మార్చుకోవాలని పలువురు భావించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరుతో పార్టీ ఎంతలా నష్టపోతుందో క్షేత్రస్థాయిలో ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని పసిగట్టిన జేసీ ప్రభాకర్‌రెడ్డి వెంటనే తాడిపత్రి మీదుగా పాదయాత్రను రద్దు చేయించి, దారి మళ్లించేలా పావులు కదిపారు. జేసీ ప్రభాకరరెడ్డి మాయలో చిక్కుకున్న లోకేష్ సైతం పార్టీ పాత కాపులను కాదని ముందుకు సాగేందుకు సిద్ధమయ్యారు. ఇది కాస్త విమర్శలకు తావిస్తోంది.

అల్లర్లు సృష్టించేందుకే లోకేష్ పాదయాత్ర

- విలేకర్ల సమావేశంలో వెన్నపూస రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

రాయదుర్గం: ప్రశాంతంగా ఉండే అనంత జిల్లాలో అల్లర్లు సృష్టించేందుకే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేపట్టినట్లుగా ఉందని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. ఏ లక్ష్యమూ లేని లోకేష్ పాదయాత్ర వల్ల ప్రజలకు ఒరిగేదేమిటో టీడీపీ నాయకులకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపేందుకు సోమవారం రాయదుర్గానికి వచ్చిన ఆయన స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్నారన్నారు. అన్ని రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ విషయాలు గిట్టని లోకేష్... ప్రశాంతతను చెడగొట్టేలా ప్రాంతాలు, వ్యక్తుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యత ఓటు కోసం పీడీఎఫ్ అభ్యర్థితో లోపాయికారి ఒప్పందం చేసుకున్న చంద్రబాబు.. ఓటింగ్ విషయంలో చివరకు పీడీఎఫ్ అభ్యర్థికి వెన్నుపోటు పొడిచారన్నారు. 2024 ఎన్నికల్లో జగన్ సునామీని అడ్డుకోవడం ఎవరి వల్ల సాధ్యం కాదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, పార్టీ ముఖ్య నాయకుడు బోర్‌వెల్ నాగిరెడ్డి, అడ్వకేట్ ఆర్‌టీ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా భూసార పరీక్షలు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల పొలాల్లో భూసార పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. ఈ మేరకు రైతుల పొలాల్లో మట్టిని సేకరించి ప్రయోగశాలలో భూసార పరీక్షలు పక్కాగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. భూసార పరీక్షల నిర్వహణపై శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని నియోజకవర్గ స్థాయి అగ్రికల్చర్ ల్యాబ్ ఏఓలు, సిబ్బందికి అనంతపురంలోని భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబోరేటరీ–ఎస్‌టీఎల్)లో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో సోమవారం ప్రారంభమైంది. ఏడీఏ ఎల్.రోజాపుష్పలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రానాయక్ హాజరై, మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పంటల సాగు యాజమాన్యంలో మట్టి పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. ఎంపిక చేసిన పొలాల్లో. సేకరించిన మట్టిలో పీహెచ్, ఈసీ, ఓసీ, ఎన్–పీ–కే, సల్ఫర్, జింక్, బోరాన్, మెగ్నీషియం, ఐరన్, మాంగనీసు లాంటి పోషకాలను విశ్లేషించడంపై టెక్నికల్ ఏఓలు ఆదిలక్ష్మి, రుమానాబేగం అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

14న హజ్ యాత్రికులకు శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: హజ్ యాత్రకు వెళ్లే వారికి అక్కడి నిబంధనలు, ఆచరించాల్సిన విధానాలపై ఈ నెల 14, 16 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు హాజీస్ ఖాదిమ్ మహమ్మద్ రఫీ సోమవారం తెలిపారు. అనంతపురంలోని చాందినీ మసీదులో నిర్ణీత రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. రంజాన్ ముగిసిన తర్వాత ప్రతి ఆదివారమూ ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకూ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా హజ్ యాత్రకు సంబంధించిన బుక్‌లెట్ అందిస్తామన్నారు. మహిళలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు సంబంధించి వేదిక, సమయం నిర్దేశించిన తర్వాత ప్రకటిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94409 83090లో సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తా .. వ్యక్తి మృతి

కూడేరు: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన లోకేష్ (48), సుశీలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆటోలో కూరగాయలు తీసుకెళ్లి విక్రయించడం వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కొర్రకోడులో కూరగాయలు విక్రయించి తిరుగు ప్రయాణమైన దంపతులు.. ఆ గ్రామ శివారులోకి చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి లోకేష్ మృతి చెందాడు. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

గుత్తి: స్థానిక ప్రజా వైద్యశాల ప్రాంతంలో సోమవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రోడ్డుపై వెళుతున్న నాగలక్ష్మి, సావిత్రితో పాటు మరో వ్యక్తిని కరిచి గాయపరిచింది. స్థానికులు వెంటనే కుక్కను తరిమి క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతి దూలం లాగుతున్న వృషభాలు

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి సమీపంలో వెలసిన అక్కదేవతల జాతరను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పుల్లానారాయణపల్లి గ్రామానికి చెందిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కరరెడ్డి నిర్వహించిన ఈ పోటీలకు 13 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. పోటీల్లో అనంతపురం జిల్లా తోపుదుర్తి గ్రామానికి చెందిన రైతు చెన్నప్ప వృషభాలు నిర్ణీత 15 నిమిషాల గడువులో 4,750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే అనంతపురం జిల్లా, గార్లదిన్నెకు చెందిన రైతు పరమేశ్వర వృషభాలు 4,158 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్పకు చెందిన మరో జత వృషభాలు 4,076 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, బోరంపల్లి గ్రామానికి చెందిన రైతు బాబా ఫకృద్దీన్ వృషభాలు 3,500 అడుగులు, చివరగా తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన రైతు నరసింహ వృషభాలు 3,173 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

ప్రియుడితో ఉడాయించిన నవవధువు

- మనస్తాపంతో భర్త అదృశ్యం



బండ్లపల్లి తిమ్మరాజు (ఫైల్)

రాప్తాడు రూరల్: వివాహమైన మూడు రోజులకే ప్రేమించిన వ్యక్తితో నవ వధువు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త ఇంటినుంచి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన బండ్లపల్లి తిమ్మరాజు, ప్రశాంత్‌కుమార్ సోదరులు. వీరికి తండ్రి లేడు. బతుకు తెరువు కోసం తల్లి అంజనమ్మ కువైట్‌కు వెళ్లింది. ఈ క్రమంలో సోదరులిద్దరూ అనంతపురానికి వలసవచ్చి నగర శివారులోని కురుగుంట వైఎస్సార్ కాలనీ నివాసముంటున్నారు. తిమ్మరాజు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా, ప్రశాంత్‌కుమార్ డిగ్రీ పూర్తయి ఇంటివద్దనే ఉంటున్నాడు. గత నెల 9న ఓ యువతితో తిమ్మరాజుకు వివాహమైంది. ఈ పెళ్లి ఇష్టంలేని ఆమె పెళ్లైన మూడో రోజే అంతకు ముందు తాను ప్రేమించిన యువకుడితో వెళ్లిపోయింది. నవ వధువు కనిపించకపోయే సరికి కంగారుపడ్డ తిమ్మరాజు, బంధువులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన తిమ్మరాజు ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోదరుడు ప్రశాంత్‌కుమార్ పలుచోట్ల వెతికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు. తిమ్మరాజు ఆచూకీ తెలిసిన వారు 94407 96811 (సీఐ), 93469 17102 (ఎస్‌ఐ) నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు


నగరంలోని రెండో రోడ్డులో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ అంటిస్తున్న మేయర్ వసీం


సీఎం జగనన్న స్టిక్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధురాలు ఉరుముల అంజినమ్మ


ఆత్మకూరు మండలంలో జగనన్న నువ్వే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


రామినేపల్లిలో 'జగనన్న మా భవిష్యత్తు' పోస్టర్లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమ పిల్లల భవిష్యత్‌కు బాట పడిందని, విద్యాపథకాలతో కార్పొరేట్ హంగులతో ప్రభుత్వ పాఠశాలలను మార్చేశారని.. వైఎస్సార్‌సీపీకే అండగా ఉంటామని మహిళలు మేయర్ వసీంతో ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం 44వ డివిజన్‌లో కార్పొరేటర్ శాంతి సుధ నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ కార్యక్రమానుద్దేశించి ప్రజలకు వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలకు జవాబులను నమోదు చేసి, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా? అని ఆరాతీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. లబ్ధిదారులకు ఇంకా అవసరమైన సమస్యలను తెలుసుకోవడంతో పాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ బృహత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, చింతకుంట మధు పర్యవేక్షణలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం దూసుకెళ్తోంది. స్థానిక కార్పొరేటర్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు, ఇస్సాక్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: జగనన్నే మనందరి భవిష్యత్ అని వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి తెలిపారు. మండలంలోని రామినేపల్లిలో నాలుగో రోజూ 'జగనన్న మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని, సంక్షేమ పథకాల వర్తింపు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మారూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండా రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, సాకే చంద్ర, ముత్యాలు, జయన్న, నరసింహ రెడ్డి, చిరుతల నాగేంద్ర, భోగినేపల్లి భాస్కర్ రెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, మహిళా నాయకురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సోమవారం జరిగింది. గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలు వందశాతం సంతృప్తి తెలియచేస్తూ గతంలో ఎన్నడూ అందని పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఆత్మకూరు ఉరుముల అంజినమ్మ అనే వృద్ధురాలు ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికించడంతో ఆనందంతో క్షీరాభిషేకం చేసింది. ఆమె మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో మూడు నాలుగురోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ కోసం కాచుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒకటో తేదీనే పింఛన్ ఇంటికి వచ్చి ఇస్తుండడంతో ఆనందంగా ఉందని తెలిపింది.

జగన్‌ది సమర్థ పాలన

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంతోనే సమర్థపాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని న్యామద్దలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేశన్న, నాయకులు భాస్కర్, నారాయణ స్వామి, కిష్టప్ప, సుబ్బరాయుడు, శ్రీనివాసులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య విధానం సర్వశ్రేష్టం

- జగద్గురు పీఠం అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణశాస్త్రి


ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు, ఆధ్యాత్మికవేత్తలు

అనంతపురం కల్చరల్: హోమియో వైద్యవిధానం సర్వశ్రేష్టమని జగద్గురు పీఠం అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. సోమవారం స్థానిక రాజ్యలక్ష్మమ్మ ఆశ్రమంలో హోమియో వైద్య పితామహుడు శామ్యూల్ హానిమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డాక్టర్ వావిలాల రామకృష్ణశాస్త్రితో పాటు డాక్టర్ వి.నాగేశ్వరరావు, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ పోగుల కుమారయ్య, ఆశ్రమ అధ్యక్షుడు పరుచూరు సూర్యప్రకాష్, రమణ, పీజీ నాగభూషణం తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై హానిమాన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పీజీ విఠల్, బాలన్న, మారుతీప్రసాద్, ఉజ్జనయ్య తదితరులు పాల్గొన్నారు.

అహుడా అభివృద్ధికి చర్యలు

- నూతన జిల్లా కలెక్టర్ గౌతమి


కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

అనంతపురం క్రైం: అహుడా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నూతన కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న గౌతమిని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అహుడా పరిధిలో ఏర్పాటు చేసిన లేఔట్‌లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌కు మహాలక్ష్మి శ్రీనివాస్ వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక లేఔట్లను ఏర్పాటు చేసిన విషయాన్ని తెలియజేశారు. ధర్మవరంలో 124 ఎకరాలు, రాప్తాడు కందుకూరులో 80 ఎకరాలు, కూడేరు 30 ఎకరాలు, కొడికొండ చెక్‌పోస్టు 7 ఎకరాలు, పెనుకొండ 28, గుత్తి 14 ఎకరాల్లో లేఔట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు కలెక్టర్ గౌతమి తాను అనుడా (అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వైస్‌చైర్‌పర్సన్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఫెర్రర్ ఆశయాలు కొనసాగిద్దాం


జి.కొత్తపల్లిలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

రాప్తాడు: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయాలు కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఆర్డీటీ సీఓ రమేష్ పేర్కొన్నారు. సోమవారం జి.కొత్తపల్లి గ్రామంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా 100 కేజీల కేక్‌ను కట్ చేశారు. ప్రజలు ఏర్పాటు చేసుకున్న 'స్పందించు–సహాయం అందించు' కార్యక్రమ హుండీలను ప్రజల సమక్షంలో ఓపెన్ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌ది అని కొనియాడారు. కార్యక్రమంలో సీడీసీ సభ్యులు విజయలక్ష్మి, సిద్దమ్మ, సీబీటీ వేణు, జ్యోతి, నాగేంద్రమ్మ, రాములమ్మ, ముత్యాలమ్మ, అపర్ణ, రాజేశ్వరి, లక్ష్మీదేవి, నరసమ్మ, మేరీ, పుల్లమ్మ, గాయత్రి, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన అవసరం


హార్ట్‌స్ట్రోక్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ప్రస్తుత కాలంలో హార్ట్ స్ట్రోక్స్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్ (కార్డియోపుల్మనరి రిజాక్సియేషన్ – హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం) చేయడంపై అవగాహన కలిగి ఉండాలని కస్తూరి ఫిజియోథెరపీ కాలేజీ సెక్రటరీ డాక్టర్ సుదర్శన్ అన్నారు. సోమవారం స్థానిక కస్తూరి ఫిజియోథెరపీ కాలేజీలో యువ మిత్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, యువజన జాగృతి సొసైటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స, సీపీఆర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ మోహన్‌కృష్ణ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా యువజన సర్వీసులశాఖ మేనేజర్ సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హార్ట్ స్ట్రోక్స్ పెరుగుతున్న ఈ తరుణంలో సీపీఆర్‌పై శిక్షణ ఇప్పించడం అభినందనీయమన్నారు. నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఆర్ చాలా తేలికైన ప్రక్రియ అన్నారు. ప్రతి ఒక్కరూ నేర్చుకొని ఆపద సమయంలో అవసరమైనప్పుడు ఈ విధానంతో సాటి మనిషిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కస్తూరి ఫిజియోథెరపీ కాలేజీ కరస్పాండెంట్ చంద్రశేఖర్, యువమిత్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, యువజన జాగృతి సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వెంకటేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణు పాల్గొన్నారు.

కనుల పండువగా రేణుకాయల్లమ్మ జాతర


వెండి రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ తదితరులు


అలంకరణలో రేణుకా యల్లమ్మతల్లి

- శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: నగరంలోని నాల్గో రోడ్డులో వెలసిన రేణుకా యల్లమ్మ జాతర మహోత్సవాలు శోభాయాత్రతో సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వెండిరథాన్ని, శోభాయాత్రను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా హాజరై ప్రారంభించారు. బుడబుక్కల ఆరాధ్యదైవమైన రేణుకా యల్లమ్మ తల్లి ఎంతో మహిమాన్వితమన్నారు. మేయర్ వసీం, కార్పొరేటర్ ఇషాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పిస్తారని, మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

14 వరకూ చేనేత, హస్తకళ ప్రదర్శన

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీ రోడ్డు మున్సిపల్ షాదీఖానాలో ఈనెల 14వ తేదీ వరకూ చేనేత, హస్తకళ ప్రదర్శన, అమ్మకాలు జరగనున్నట్లు విజయవాడ శ్రీకళాజ్యోతి హ్యాండిక్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజర్ వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత, హస్తకళలకు సంబంధించిన చీరలు, బట్టలు, వస్తువులు ప్రదర్శనలో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

'పది' గణితం పరీక్షకు 538 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన గణితం పరీక్షకు జిల్లాలో 538 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 139 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 33,700 మంది విద్యార్థులకు గాను 33,162 మంది హాజరయ్యారు. ఏడు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్, రెండు కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, 48 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

19 నుంచి ఊబిచెర్లలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో ఈనెల 19 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మీరెడ్డి, లక్కిరెడ్డి శేఖర్, హుసేన్ బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో కాశీ విశ్వనాథ్, శివుడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో విజేతలకు మొదటి బహుమతి కింద రూ.30,116, ద్వితీయ బహుమతిగా రూ.20,116 ఇస్తామన్నారు. ఆసక్తి గల జట్లు రూ.1,100 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8919663064, 9849294413 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మల్లేశ్వరస్వామికి మహారుద్రాభిషేకం

ఉరవకొండ: పట్టణంలోని మల్లేశ్వరస్వామి మూలవిరాట్‌కు మహా రుద్రాభిషేక పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి పంచామృతభిషేకం, కుంకమార్చన, క్షీరాభిషేకం చేపట్టారు. భక్తులు సామూహిక అర్చనలు నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ ఉత్సవం చేపట్టారు.

లివర్ అడిగినందుకు కత్తితో దాడి

యాడికి: చికెన్ కొన్న వ్యక్తి లివర్ కూడా కావాలని అడిగినందుకు చికెన్ షాపు నిర్వాహకుడు కత్తితో దాడి చేశాడు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడుకు చెందిన రంగస్వామి గత ఆదివారం సాయంత్రం యాడికి మండలం రాయలచెరువు గ్రామంలో బాబా చికెన్ సెంటర్ వద్ద చికెన్ తీసుకున్నాడు. లివర్ కూడా ఇవ్వాలని చికెన్ షాపు యజమాని బాబాను అడిగాడు. షాపు యజమాని లివర్ లేదు అన్నందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. షాపు యజమాని బాబా కొడుకు రంగస్వామిపై కత్తిని విసరడంతో చెవికి గాయమైంది. సోసోమవారం సాయంత్రం చికెన్ షాపు యజమానిపై రంగస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

బాలుడికి అరుదైన చికిత్స


చిన్నారికి అరుదైన చికిత్స అందించిన కిమ్స్ సవీరా వైద్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని కణేకల్లుకు చెందిన బాలుడికి కిమ్స్ సవీరా ఆస్పత్రిలో అరుదైన చికిత్స చేశారు. వివరాలను వైద్యులు మూడే సందీప్ వెల్లడించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థి పాఠశాలకు వెళ్లినప్పుడు ఉన్నపళంగా కళ్లు తిరిగి కింద పడిపోయాడు. అతన్ని స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కిమ్స్ సవీరా ఆస్పత్రికి తరలించారు. బాలుడికి గుండెవేగం నిమిషానికి 30 సార్లు (60–70 ఉండాల్సింది) మాత్రమే కొట్టుకుంటోందని వైద్యులు నిర్ధారించారు. అతన్ని ఐసీయూలో చేర్చి తాత్కాలిక పేస్ మేకర్ అమర్చారు. అనంతరం బాలుడికి అన్ని పరీక్షలు చేసి, సోమవారం డిశ్చార్జ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం: జిల్లా కేంద్రాల్లో 50 అంశాలకు సంబంధించిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎం.గౌతమికి జేఏసీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ చైర్మన్ ఆర్ఎన్ దివాకర్ రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12న రైతు సదస్సు

అనంతపురం సెంట్రల్: నగరంలో హెచ్చెల్సీ కాలనీ వద్దనున్న వీకేభవన్‌లో రైతుల సమస్యలు – ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 12న సదస్సు నిర్వహిస్తున్నట్లు భారత్ ప్రజా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం


జ్యోతులు ఎత్తుకొని గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, యువతులు

కనగానపల్లి: మండల కేంద్రంలో సోమవారం ఆంజనేయస్వామికి జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి ఆకుపూజ చేయించి, ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు, యువతులు జ్యోతులు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామికి సమర్పించారు. మంగళవారం గ్రామంలో పోతలయ్యస్వామికి బోనాల పండుగ చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

మూడు చక్రాల వాహనం వితరణ


ద్విచక్ర వాహనం అందిస్తున్న ఎంపీ రంగయ్య

అనంతపురం సెంట్రల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన వలి అనే దివ్యాంగుడికి రూ. 85 వేలు విలువజేసే టీవీఎస్ కంపెనీకి చెందిన ద్విచక్ర వాహనాన్ని ఎంపీ తలారి రంగయ్య చేతుల మీదుగా ఎంపీ నివాసంలో అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, పప్పూరు మధు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

అనంతపురం క్రైం: ప్రభుత్వం ఇంటి పన్ను ఒకే ఏడాది చెల్లిస్తే 5 శాతం రాయితీని కల్పించడంతో పన్ను చెల్లింపుదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కౌంటర్లు ప్రజలతో కిక్కిరిసిపోయాయి. ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించిన డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి కమిషనర్ రమణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. నగరపాలక సంస్థలో మరో రెండు కౌంటర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. వయో వృద్ధులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో గ్రీన్ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని, తద్వారా ఎండదెబ్బ తగలకుండా ఉంటుందని అధికారులను డిప్యూటీ మేయర్ ఆదేశించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

అనుమతి తీసుకోకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సిబ్బంది పనితీరు పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీ పాల్గొన్నారు.

15లోపు 'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్: తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాదరణకు గురైన, నిరాశ్రయులైన 18 ఏళ్లలోపు అనాథ పిల్లలు ఈనెల 15లోపు 'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోవాలని తాడిపత్రి సీడీపీఓ షాజిదా బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ పథకం కింద అనాథ పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

వడదెబ్బపై ఉచిత వైద్య శిబిరం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ప్రభాకర్‌జీ మున్సిపల్ పాఠశాలలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వడదెబ్బపై ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వైద్యులు తిరుపతినాయుడు, రాంకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు వడదెబ్బ తగలకుండా హోమియో మందులు పంపిణీ చేశారు. హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్మాయిల్‌కు డాక్టరేట్


ఇస్మాయిల్ కాకరవాడ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన ఇస్మాయిల్ కాకరవాడకు సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ ఏ మహాముని (సూపర్‌వైజర్), ప్రొఫెసర్ వి. పాండురంగడు (కో–సూపర్‌వైజర్) పర్యవేక్షణలో 'మెకానికల్ అండ్ మెషినబిలిటీ బిహేవియర్ ఆఫ్ ఏ–36–టీట్ ప్లస్ టిక్ ఇన్–ఎస్ఐటీయూ కాంపోజైట్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ఈ పరిశోధనాంశంపై ప్రచురించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన ఇస్మాయిల్ జేఎన్‌టీయూ అనంపతపురంలో ఫుల్‌టైం పీహెచ్‌డీ ప్రోగ్రాంలో అడ్మిషన్ పొందారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

అనంతపురం క్రైం: కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధికా ప్రాధాన్యతనిస్తోందని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులకు పరకలు, దుస్తులు, కాలువ తీసే సామగ్రి, తదితర పనిముట్లు అందించారు. కార్మికులకు అందించాల్సిన మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధిలో కార్మికులు కీలకపాత్ర అని కొనియాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, డీఈ రాంప్రసాద్ రెడ్డి, కార్పొరేటర్లు ఇస్సాక్, అనిల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని చాందినీ మసీదులో చాందినీ మసీదు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ వసీం సలీం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చాందినీ మసీదు చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతం రంజాన్ మాసంలో పెద్ద ఎత్తున దానధర్మాలు చేయడం ఆనవాయితీ అన్నారు. అనంతరం ముస్లింలకు రంజాన్ తోఫా అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, మౌలానా హారూన్ రషీద్, చాందినీ మసీదు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మునీర్‌బాషా, మహమ్మద్ రఫి, షెక్షా, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అనంత చంద్రారెడ్డి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనంత చంద్రారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని భాగ్యనగర్‌లో ఉన్న మస్జిదే రజాలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి(మిక్సర్ రెడ్డి) ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖరరెడ్డి, నాగేంద్ర, రెడ్డమ్మ, జానీ, రామాంజనేయులు, కేశవరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా మా కక్షిదారుడయిన ముంద్లూరు అనూప్‌కుమార్ తండ్రి ముంద్లూరు రామప్ప నివాసం: డోర్ నెం. 74, విశ్వేశ్వరయ్యనగర్, కొప్పగల్ రోడ్డు, గాంధీనగర్, బళ్ళారి, కర్ణాటక రాష్ట్రం వారి తరుపున ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులు మా కక్షిదారుని తాతగారైన ముంద్లూరు నరసింహప్ప తండ్రి అనుమన్న, బళ్ళారి గారు దాక్యుమెంటు నెం. 2577/1926 తేది 11-08-1926న కవుడికి బర్మప్ప, పెద్ద శరణప్ప, చిన్న శరణప్ప, పెద్ద యర్రప్ప వగైరాల నుంచి కొనుగోలు చేసినారు మరియు మా కక్షిదారుని తండ్రి గారైన ముంద్లూరు రామప్ప తండ్రి ముంద్లూరు నరసింహప్పకు దాక్యుమెంటు నెం. 1528/1962 తేది 01-01-1962 భాగపరిష్కారం ద్వారా సంక్రమించినవి. సదరి షెడ్యూలు దాఖలా ఆస్తుల యందు మా కక్షిదారుని తండ్రి అయిన ముంద్లూరు రామప్పకు సగభాగము మరియు అతని సోదరుడైన యం.హనుమన్నకు సగభాగం కలదు. ముంద్లూరు రామప్ప గారు గతించిన తరువాత అతని అర్ధ భాగము మా కక్షిదారుడైనటువంటి ముంద్లూరు అనూప్ కుమార్ కు సంక్రమించినది. మిగతా అర్ధ భాగము హనుమన్న వారసులకు సంక్రమించినది. కావున సదరి ఆస్తుల విషయము ఎవరుకానీ ఎటువంటి లావాదేవీలు చేయకూడదు. ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులపై మా కక్షిదారుడు పూర్తి సర్వహక్కులు కలిగియున్నారు. కాబట్టి ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరైన లావాదేవీలు జరిపినచో అటువంటి వారిపైన మా కక్షిదారుడు తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

షెడ్యూలు

అనంతపురము రి॥డి॥ అనంతపురము సబ్॥డి॥కి చేరిన కక్కలపల్లి గ్రామ పొలంలో రుద్రంపేట పంచాయతీ ఏరియాలోని ఆస్తుల వివరం.

ఖాబు వివరం	సర్వే నెం.	ఎ.సి.
సర్కారు ఖుష్కి	99-1	7.12
సర్కారు ఖుష్కి	99-2	6.65
సర్కారు ఖుష్కి	100	15.08
	అంతా వెరసి	28.85

N.R.K. MOHAN, Advocate, Kamala Nagar, Anantapuramu. Cell: 9440787100